

వనితలు పురుషులకన్నా ఎంతో వెనుక వడ లేదని ఈ వివరాలు నిరూపిస్తున్నాయి. పురుషులకి, వనితలకి మధ్యవున్న 'దూరం' రానురానూ తగ్గిపోతోందని తెలుస్తోంది. రికార్డులని మెరుగు పరచడంలో వనితలే పురుషులని అధిగమిస్తున్నట్లు తేలింది.

1928 నుంచీ నేటివరకూ 100 మీటర్ల పురుషుల రికార్డు 0.7 సెకన్లు మెరుగయితే, వనితల రికార్డు 1.2 సెకన్లు మెరుగయింది. 800 మీటర్ల పురుషుల రికార్డులో 8.3 సెకన్లు మెరుగు కనిపిస్తే, వనితల రికార్డులో 23.3 సెకన్ల మెరుగుదల కనిపించింది.

అలాగే మరాతాన్ పరుగు పందెంలో (42, 195 మీటర్లు) వనితలు సాధించిన విజయానికి ఒక రికార్డు చెప్తేచాలు. న్యూయార్కులో జరిగిన మరాతాన్ పోటీలో నార్వేకి చెందిన గ్రేట్ విన్జ్ ఆ దూరాన్ని 2 గంటల 25 నిమిషాల 41 సెకన్లలో పరిగెత్తింది. 1948 ఒలింపిక్ పురుషుల రికార్డు కన్నా ఇది మెరుగు. 1956 ఒలింపిక్ పోటీలలో రెండవ స్థానంతో వెండి పతకం అందుకున్న మరాతాన్ పరుగు ప్రవీణుడి 'కైమింగ్' కన్నా ఇది తక్కువ.


అలా అబల క్రీడారంగంలో తను పురుషుడికి తీసిపోనని నిరూపించుకుంది. ఈ రోజున వనితలు ఎవరెస్ట్ అధిరోహిస్తున్నారు. పడవలో ప్రపంచ పర్యటన జరుపుతున్నారు. పారాచూట్ జంపింగ్‌లో ప్రపంచ రికార్డు స్థాపిస్తున్నారు. షూటింగ్ పోటీలలో పురుషులని రెండవ స్థానానికి వనితలు పంపగలరని ఐరోపా షూటింగ్ పోటీలు నిరూపించాయి.

ఇక 1984 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ పోటీలలో తమకొరకు ప్రత్యేకంగా నిర్వహించే 16 క్రీడలలో వనితలు పాల్గొంటున్నారు. పురుషులతో కలసి మూడు పోటీలలోనూ పాల్గొంటున్నారు.

ఈ పరిశీలన వనితలు ప్రతి సంవత్సరమూ క్రీడారంగంలో తమ శక్తిని, యుక్తిని పెంచుకుంటూ ముందుకు వెళ్తున్న విషయం చెప్తోంది. ఇక ఈ నవంబర్‌లో న్యూఢిల్లీలో జరిగే ఆసియా క్రీడోత్సవంలో మరికొన్ని కొత్త ప్రమాణాలు వనితలు నెలకొల్పుతారనీ ఆశించవచ్చు.

—బి. కె. వేణి

## చిట్టికథ



# దానం

"అమ్మా! మాదాకవళం తల్లీ! రెండు రోజులై తిండి లేదమ్మా. గుప్పెడు మెతుకు లెయ్యండమ్మా."

బుట్టలో అరటిపళ్ళు, కొబ్బరికాయ, పువ్వులు, చక్రపొంగలి సర్ది, దేవాలయానికి బయలుదేరుదామనుకుంటున్న తాయారమ్మ ముష్టివాడి కేక విని వీధి గుమ్మంలో కొచ్చి దేవాలయానికి బయలుదేరుతుంటే 'నువ్వా ఎదురు' అనుకుని "అలా పైకెళ్ళు, ఏదైనా పని చేసుకోకూడదూ? సులువైన పని ముష్టి" అని కసిరేసింది.

మొలకి చిన్నలుంగీ, చేతికి ఒక జోలి, చేతిలో తూట్లు పడిన సిల్వరు గిన్నె, పొట్ట వెన్నెముకకి అంటుకుపోయి, కళ్ళలో వున్నాయి ప్రాణాలు. బిచ్చగాడికి ప్రొద్దుటే ఏ తల్లి లేదందో బోణీ, ఆ రోజు మధ్యాహ్నంవరకు తిరిగి, తిరిగి ఖాళీ గిన్నెతో ఒక మర్రిచెట్టు కిందకి వచ్చి కూర్చున్నాడు ముష్టివాడు. సాధారణంగా బిచ్చగాళ్ళు అడుక్కుని తెచ్చుకున్న అన్నం, ఆ మర్రిచెట్టు నీడని తిని అక్కడ అరుగు మీద పడుకుంటారు. పదిఏళ్ళ కుర్రాడు తాను తెచ్చుకున్న పులుసు అన్నం గబగబా తింటూ, తాతకేసి చూసి, తాతా "ఈయాల నీకు కూడు దొరకలేదా? ఇంద నాకింకొద్దు ఈ మిగిలిన కూడు నువ్వు తినేసెయ్" అన్నాడు.

తాత కళ్ళనుండి కన్నీటిబొట్లు రాలినయ్. అవి చిన్నకుర్రాడు అన్నందుకు ఆనంద బాష్పాలో, ఆకలి తట్టుకోలేక వచ్చిన కన్నీటి బిందువులో మరి. తాత మిగిలిన అన్నం తిని, గబగబా మంచినీళ్ళు త్రాగి మర్రిచెట్టు నీడని పడుకున్నాడు. పడుకున్న ముసలివాడు ఎప్పటికీ లేవకపోయేసరికి అక్కడ వున్న ఇద్దరు, ముగ్గురు ముష్టివాళ్ళు తాతని లేపడానికి ప్రయత్నించి చచ్చిపోయిన తాతని చూచి ఘొల్లుమన్నారు. ప్రక్కనే వున్న రిక్షాస్టాండు వాళ్ళంతా గుమిగూడారు.

అందులో ఒకడు "ఈడు మొదట్లో రిచ్చాలాగేవాడు. రోజూ మల్లమ్మ పేటలో వుండే ప్లీడరు బాబుని ఈడే రోజూకోర్టుకు తీసుకెళ్లేవోడు. ఒక రోజు ఈడిరిచ్చాకి ఎదురుగ్గా వస్తున్న కారు గుద్దేసి, ప్లీడరుబాబు రిక్షాలోంచి కింద పడి వెత్తిన గాయం తగిలినాది. రోడ్డంబట పోయే ఆళ్ళందరూ ఏదీ పట్టించుకోకుండా పోతుంటే ఈ నారాయడే ప్లీడరు బాబును ఆస్పటల్లో సేర్పించాడు. ప్లీడరుబాబు ఇంటికెల్లి అమ్మకి సెప్పిండు. బాబుగార్కి రక్తం కావలిసొస్తే నారాయడే ఇచ్చిండు.

"తర్వాత కొంత కాలానికి నారాయడుకి పక్షవాతం వచ్చి ఒక చెయ్యి సాధనం లేక రిచ్చా తొక్కనేక నాయన్న ఒళ్ళు ఎవ్వరూ నేక అడుక్కునే స్థితికొచ్చిండు" దేవాలయాన్నుంచి తిరిగివచ్చే తాయారమ్మ రిక్షావాడి మాటలు విని అవాక్కయిపోయింది. గుంపునుంచి తప్పించుకుని వెళ్ళి ముష్టివాడి మొహం చూచి ప్రొద్దుట వచ్చిన ముష్టివాడు వీడే. వీడేనా – తన భర్తని రక్షించిన నారాయడు అని మనస్సులోనే అనుకుంది.

ఆకలితో అలమటించిపోతున్నవాడికి పట్టెడన్నం వెయ్యలేదు. ఏమి ఆశించని గుడిలో దేవుడికి చక్రపొంగలి, అరటిపళ్ళు, కొబ్బరికాయ! బుట్టలో ప్రసాదం తాయారమ్మని 'నువ్వు ఒక మనిషివేనా' అన్నట్లుగా వెక్కిరిస్తున్నట్లనిపించింది. వెంటనే ఇంటికి వెళ్ళి భర్తని వెంటబెట్టుకుని వచ్చి నారాయడి దహన సంస్కారాలకి కావలసిన డబ్బు ఇచ్చి, ఆ రోజు బీద వాళ్ళందరికి అన్నదానం చేయించింది.

—ఓరుగంటి లక్ష్మిరామకృష్ణ